# బ్రాడ్ బ్యాండ్ చైతన్యం

-వుప్పల నరసింహం

మకర సంక్రాంతి నాడు దేశంలో బ్రాడ్ బ్యాండ్ సర్వీసులు ప్రారంభమయ్యాయి. దీంతో సమాచార విజ్ఞాన (ఐ.టి.) విప్లవ ఫలితాలు గ్రామీణులకు సైతం చేరువ అవుతాయి. ఐ.టి. విప్లవ ప్రభావాన్ని చూసేందుకు తిరస్కరించేవారు కంప్యూటర్లు కూడుపెడతాయా? గుడ్డ పెడతాయా? అని ఇంకా ప్రశ్నించడం విడ్డూరంగా ఉంటుంది. కంప్యూటర్లు కూడు, గుడ్డను సృష్టించడంలో కీలక పాత్రను పోషిస్తున్నాయని తెలుసుకుంటే ఎన్నో భ్రమలు తొలగిపోతాయి. అమాయకంగా వేసే ప్రశ్న లకు జవాబులు దొరుకుతాయి.

రష్యా విప్లవం కన్నా, చైనా విప్లవం కన్నా ఐటి విప్లవం ప్రభావం మానవాళిపై ఎంతో పడిందనే వాస్తవాన్ని గమనిస్తే ఎన్నో చిక్కుముడుల ప్రశ్నలు ఇట్టే దూది పింజల్లా తేలిపోతాయి. రక్తపాతం వల్ల వచ్చేదే విప్లవం కాదు. శాంతియుతంగా ప్రజల జీవితాల్లో మార్పులు అదీ గణనీయమైన మార్పులు తీసుకురావడం కూడా విప్లవమే. ఆ కోవలోకి వచ్చేది ఈ ఐ.టి. విప్లవం. ఒకప్పుడు పారిశ్రామిక విప్లవంలో భారత దేశం పాలు పంచుకోలేకపోయింది. దానికి కారణం భారతదేశం అప్పుడు పరాయి పాలనలో ఉంది. ఇప్పుడు స్వేచ్ఛాజీవులం కాబట్టి ఐ.టి. విప్లవంలో పాలు పంచుకోవడం కనీస కర్తవ్యం. అలా చేయని పక్షంలో ఇంకా వెనకబడిపోవడం ఖాయం.

ఈ మౌలిక విషయాన్ని అందరూ గుర్తించాలి. అన్ని పక్షాలు, అన్ని సెక్షన్ల ప్రజలు దీనిపై అవగాహనను పెంచుకోవాలి. తదనుగుణంగా స్పందించాలి. బతుకులు చక్కదిద్దుకోవాలి.

ప్రజల జీవితాలను ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు ప్రభావితం చేస్తాయే తప్ప అవి అన్ని విషయాలను, సమస్యలను పరిష్కరించవు. ప్రజల చొరవ, భాగస్వామ్యం, విజన్ కూడా ముఖ్యం.

మారుతున్న కాలానుగుణంగా స్పందిస్తూ ఉపాధి అవకాశాలను, ఆదాయ మార్గాలను వెతుక్కుంటూ బతుకులను చక్కదిద్దుకోవడానికి ప్రజలు ఇతరులపై పార్టీలు, ప్రభుత్వాలు ఆధారపడటం తగ్గించుకోవాలి. ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూసి మోస పోయే బదులు సకాలంలో మేల్కొని సరైన నిర్ణయాలు తీసుకుని బతుకును బాగుచేసుకునేందుకు పూనుకోవాలి.

దేశంలో కోట్ల మంది మధ్యతరగతి ప్రజలు ఈ వైఖరిని అవలంబిస్తూ సైన్స్, ఐ.టి. ఫలితాలను అనుభవిస్తున్నారు. నిర్ణయాత్మక శక్తిగా ఎదిగారు. వారిని అడ్డుకున్న వారు ఎవరూ లేరు. ప్రోత్సహించిన వారే ఉన్నారు.

అదే మాదిరిగా గ్రామీణ ప్రాంతం వారు ఇప్పుడిప్పుడే ఉన్నత చదువులపై మక్కువ చూపుతున్నారు. ఈ ధోరణిని కొనసాగిస్తూ సైన్స్, ఐ.టి. విప్లవ ఫలితాలను అందుకోవాలి. అందుకు ఈ బ్రాడ్ బ్యాండ్ సర్వీసులు ఎంతగానో ఉపయోగపడతాయి. ఏ అంశంపై ఎంత ఖర్చు చేయాలి? అన్న ప్రాధాన్యతలు కూడా గుర్తెరిగితే కూడా చాలా మంచి ఫలితాలు పొందే అవకాశం ఉంది.

ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో టెలిఫోన్ సౌకర్యం పెరిగింది. ఈ బ్రాడ్ బ్యాండ్ వల్ల ఇంటర్‌నెట్ సౌకర్యం పెరుగుతుంది. ఆక్సెస్ పెరుగుతుంది. దాంతో గామాలు ప్రపంచంతో కనెక్ట్ అవుతాయి. ఆ సౌలభ్యం ఉంటే ఆకాశమే హద్దు అవుతుంది. కాబట్టి ప్రజలు తమ జీవితాలను తీవ్రవాద రాజకీయ పార్టీల చేతుల్లోనో, మరో రాజకీయ పార్టీ చేతుల్లోనో పెట్టకుండా తమ జీవితాలను తామే మెరుగుపరచుకునే ప్రక్రియను ప్రారంభించడంలో మునిగిపోవాలి. ఇందుకు గాను ఇది కీలకమైన సమయం. బ్రాడ్ బ్యాంక్‌ను మరింత సమర్థవంతంగా పనిచేసేలా మన 'చైతన్యం' పెరగాలి. చైతన్యమే విచక్షణా జ్ఞానాన్ని పెంచుతుంది. జ్ఞానం మనిషి జీవితాన్ని మారుస్తుంది. ■

## వైకల్యం

అంగ వైకల్యం
వికారం.
మనోవైకల్యం,
ప్రమాదకరం.

-కొప్పుల పద్మావతి